# మనస్తత్వాలు

"ఈ మూడు గదులకీ మూడువందలివ్వడానికి-చేరి ఇంకా పూర్తిగా ఏడాది కాలేదు.వంద రూపాయలు పెంచాలిట అద్దె."ఇంటామె మీద విసుక్కుంది రమ.

"ఏడాదికోమారిచ్చే ఇంక్రిమెంట్ ఈవిడే పుచ్చేసుకుందామనుకుంటోందేమో!ఏమైనా సరే-ఖాళీ అయినా చేస్తాం కాని పైసా పెంచేది లేదు అద్దె." గట్టిగానే అంది రమ.

ఇవతల వాటాలో మాటలు ఇంటామె కామాక్షమ్మ చెవిలో పడనే పడ్డాయి.

గబగబా అటునుంచి ఇటు తిరిగి ఇవతల వాటాలోకి వచ్చి,"ఆ..ఆ... ఏడాదినాడు నాతెలివి తక్కువ కొద్దీ ఇచ్చాను ఇల్లు."అంది చేతులు తిప్పుతూ.

"అదేమిటీ అలా మాట్లాడతారు?గంటన్నర ఇంటర్వ్యూ చేసి కదా ఇచ్చింది ఇల్లు?"-కంటికొసనుంచి నిర్లక్ష్యంగా చూసి, మళ్లీ తన పనిలో నిమగ్నమైంది రమ.

"ఒక్కసారిగా వంద రూపాయలు పెంచాలంటే మాటలా? ఇవ్వటికే మూడువందలిస్తున్నాం.అదే కష్టంగా వుంది.జీతంలో కొంత ముసలి అత్తగారికి మావగారికి పంపాలా?పిల్లల కాన్వెంటు జీతాలు, వెచ్చాల కొట్లో బాకీలు, మధ్య మధ్య చుట్టాలు, వెళ్లిరావలసిన పెళ్లిళ్లూ పేరంటాలు..ఏ నెల జీతం ఆ నెల సరిపడ్డమే కష్టంగా వుంది."అంది రమ బేలగా స్వగతం చెప్పుకుంటున్నట్లు.

కామాక్షమ్మ రమ దగ్గరగా వచ్చి "అమ్మా! మీ జీతం సంగతి నాకెందుకూ? అన్ని ఖరీదులూ పెరిగాయి. వాటితోపాటే ఇళ్ల ద్దెలు కూడా."అంది.

"పెరిగాయి కాదండీ!పెరుగుతున్నాయి.పెరుగుతూనే వున్నాయి అనాలి."అంది రమ ఆవేశంగా.

"ఏవమ్మోయ్ రమా!నువ్వు మా యింట్లోకి వచ్చినప్పుడు ఇలా లేవు. నిన్ను నేను ఇంటర్వ్యూ చేసినప్పుడు ఎలా మాట్టాడేవు? ఇప్పుడెలా మాట్లాడుతున్నావు ఏమైనా సరే అద్దె పెంచకపోతే ఇల్లు ఖాళీ చేయాల్సివుంటుంది. ఆ మాటే చెప్పదలుచుకున్నాను. ఆనక ఆఫీసు నుంచి మీ ఆయన రఘురాం వచ్చాక"అంది కామాక్షమ్మ అధికార స్వరంతో.

"ఆయన ఆఫీసుకి పిల్లలకి స్కూలుకీ దగ్గరని ఈ ఇంట్లో ఆవేళ చేరాం అద్దె ఎక్కువయినా ఆలోచించకుండా. పని మనిషిని మాన్పించాను.చాకల్ని మానిపించాను.

అన్నిపనులూ నేనే చేసుకుంటున్నాను. అయినా కష్టంగానే వుంది. మీ ధర్మమా అని ఇంట్లోకి ఒక్క కొత్త సరుకు అమర్చుకోలేదు ఏడాదయి" రమ గొంతులో బాధ పెల్లుబికింది.

"అదంతా నాకు తెలియదమ్మా. అలా నువ్వు బాధపడితే సరిపోదు. అద్దె పెంచడం సంగతి ఆలోచించు.అయినా నీ సంగతి ఏం అర్థం కాదు.నువ్వు మా యింట్లోకి వచ్చిన తర్వాత ఒక్క రోజున నాతో సరదాగా మాట్లాడ్డం కాని ఒక్క సాయం చెయ్యడంగాని ఏమైనా చేసావా?ఇదివరకు ఈ వాటాలో వుండి వెళ్లిన అమ్మాయి అలా కాదు. రోజూ నాకు పేపరు చదివి వినిపించేది.పాటలు పాడి వినిపించేది.మొగుడు ఏమైనా అంటే నాతో కష్టం సుఖం చెప్పుకునేది.అతనికి తెలియకుండా నాదగ్గర డబ్బులు దాచుకునేది."

కామాక్షమ్మకేసి రమ తీక్షణంగా చూసింది.

కామాక్షమ్మ ఇంకా చెప్పుకుపోతూనేవుంది.

"అతను మాత్రం నేను వంటరిమనిషినని, సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక ఇలా వంటింటి గడపమీద కూర్చుని, నేనలా తులసికోట దగ్గర వత్తులు చేసుకుంటూంటే, ఆఫీసు కబుర్లూ, ఇంటి ఖర్చులూ, ఒకటేమిటి అన్ని సంగతులూ దాపరికం లేకుండా చెప్పేవాడు. ఏమిటో..వాళ్లు వెళ్లాక ఆ సందడే పోయింది...ప్చ్..."అంటూ నిట్టూర్చింది కామాక్షమ్మ.

రమకి వళ్లు మండుకొచ్చి అంది.

"ఏమిటో పిన్నిగారూ!ఇదివరకు మేం ఉన్న ఇంటావిడ నన్ను తన కన్నబిడ్డలా చూసుకునేది. ఇలా మినప్పప్పు నానబోస్తే అలా వచ్చి రుబ్బిపెట్టేది. మీరు వట్టి కబుర్లు తప్ప పని సాయం ఏమీ లేదు."అంది మెత్తగా చెబుతున్నా ఆ మాటల్లో ఎంతో వ్యంగ్యాన్ని దట్టిస్తూ.

"ఆ..ఆ...ఎంత మాట అన్నావు. నేను...నేను..నీకు...మినప్పప్పు రుబ్బి పెట్టాలా? పెద్దదాన్ననే గౌరవం అయినా లేకుండా ఎంతలేసిమాటలంటున్నావు.హమ్మా...హమ్మా..."అంటూ గబగబా అక్కడనుంచి వెళ్లిపోయింది కామాక్షమ్మ.

రమకి కోపంతో పళ్లు ఊగిపోతోంది. ఆవేశం అదుపులో పెట్టుకోవడం కష్టంగా వుంది.ఏడాదినుంచి చూస్తోంది.ఎంత ఓర్పుగా ఉందామన్నా రోజురోజుకీ ఈమె ధోరణి మితిమీరిపోతోంది. ఏం బాగాలేదు.ఆలోచనలతో అలసిపోయి వాలుకుర్చీలో వాలిపోయింది రమ.

గడచిపోయిన రోజులూ, పాత సంగతులూ అన్నీ జ్ఞాపకంరాసాగాయి.

సరిగ్గా ఏడాది క్రితం ఈ ఇంట్లోకి అద్దెకి రావడంకోసం తను ఎంత అవస్థ పడిందీ గుర్తుకు రాసాగింది.

ఎన్నో ఇళ్లు చూసారు రఘురాం, తనూ. ప్రతి అద్దె ఇంటికీ ఏదో ఒక ఇబ్బంది వుంది.ఆఖరికి పిల్లల స్కూలుకి ఇటు రఘురాం ఆఫీసుకి దగ్గరగా వుంటుందని ఆలోచించి ఈ ఇంట్లో ఉండడానికి నిర్ణయించుకున్నారు.తాము నిర్ణయించుకుంటే అయిందా?ఈ కామాక్షమ్మ ఇల్లు అద్దెకి ఇవ్వబోయేముందు ఓ కఠినమైన ఇంటర్వ్యూ పెట్టింది.ఆ ఇంటర్వ్యూలో తను చచ్చి చెడి నెగ్గింది.

బి.ఎ. పాస్ అయిననాటి ఆనందం కంటే, రఘురాంతో తన పెళ్లి నిర్ణయం అయిందన్న రోజు సంతోషంకంటే, ఈ ఇల్లు అద్దెకి దొరికిందన్న ఆనందమే గొప్పగా కనిపించింది.

"ఏలూరు పట్టణంలో ఇల్లు అద్దెకి సంపాదించడంకోసం శ్రీమతి రమాదేవిగారు పడ్డపాట్లు"అంటూ రఘురాం నవ్వి "ఏదీ..ఏదీ...ఇంటామెతో నీ ఇంటర్వ్యూ విశేషాలు.... ఒక్కమాటు చెప్పవోయ్"అంటూ అప్పుడప్పుడు అడగడం, తను సరదాగా చెప్పడం అలవాటు.

"నీ పేరేమిటమ్మా?"ఆఫీసరు హోదాలో కామాక్షమ్మ వేసిన ప్రశ్న.

వినయంగా "నాపేరు రమ అంటారండి" తన జవాబు.

"ఆహా. ఎంత వినయం" అంటూ తెగ సంబరపడిపోయి "ఏం చదివావు?" అని మరో ప్రశ్న.

ఏం చదివానంటే ఏం గొడవో భగవంతుడా అనుకుని, "ఏదో కొద్దిపాటి చదువే లెండి" అంది.

"ఆడపిల్లకి అంతకంటే చదువెందుకు. చాల్లెద్దు..... మా తాతగారనేవారు.-వంటపనీ ఇంటిపనీ తెలియాలి గానీ ఆడపిల్లలకి చదువులెందుకు పనిలేకపోతేను! చదువుకుంటే ప్రేమలేఖలు రాస్తారు. ప్రాణాలు తీసారు.' అని.... " చాలా గొప్పగా అన్నాననుకుని

తన మాటలకి తనే నవ్వుకుంది కామాక్షమ్మ.

"కానీ విద్యలేనివాడు వింత పశువు అంటారు కదండీ" అంది తను.

కామాక్షమ్మ తబ్బిబ్బుపడి "ఆ... అదేదో సందర్భంలో అని ఉంటారులే. అది సరే... నీకు సంగీతం వచ్చా" అని కళ్ళు ఎగరేస్తూ మరీ అడిగింది.

చచ్చానురా దేవుడా. వచ్చునంటే అస్తమానం పాటలు పాడతావు కాబోలు. ఇల్లు ఇవ్వనంటుందేమో. రాదంటే ఏ పాటాపద్యం లేని గోదవి. నీకిల్లిచ్చేదేంటి పొమ్మంటుందేమో. ఏమిటి చేయడం సందిగ్ధంలో పడింది తను.

అయినా ఆవిడ ముఖ కవళికలు ఎలా ఉన్నాయో చూసి వాటినిబట్టీ సమాధానం చెబుదాం అని కామాక్షమ్మకేసి చూసింది.

"పోనీ. మామూలు పాటలేనా రావూ" అంది మాటను సాగదీస్తూ కామాక్షమ్మ. దాంతో కంగారుపడి "ఆ ఆ నాకు సంగీతం రాకేమండీ. కీర్తనల వరకూ నేర్చుకున్నాను"అంది.

"అహ్ బాగుంది. ఎప్పుడైనా ఒక కీర్తన వినిపిస్తావన్నమాట. సరే పద. మీకుఅద్దికిచ్చే వాటా ఇప్పుడు చూపిస్తాను" అంది.

ఆవిడా, ఆవిడ వెనకాల తను బయల్దేరింది.

మళ్ళీ ఇంతలోనే వెనక్కి తిరిగి "హా..." అంటూ ఏదో తేలుకుట్టినట్లు అరిచింది కామాక్షమ్మ.

మళ్ళీ ఏమడుగుతుందిరా భగవంతుడా అనుకుంది రమ.

"నీకు దేవుడూ పూజా వీటిమీద నమ్మకముందా. మీవారు ఆఫీసునుంచి తిన్నగా ఇంటికి వస్తారా. మీ పిల్లలు బుద్ధిమంతులేనా? అల్లరి చేయరు కదా. మీ ఇంటికి చుట్టాలూ స్నేహితులూ ఎక్కువగా వస్తే నాకు కిట్టదు. రేడియో నెమ్మదిగా పెట్టుకోవాలి. నాకసలే గుండెదడ..." ఇలా కామాక్షమ్మ తన షరతుల జాబితాని చదువుతుంటే అన్నింటికీ తల ఒగ్గి దేనికీ సమాధానం చెప్పలేక వినయంగా తలమాత్రం ఊపింది. అన్నింటికీ ఉమ్మడిగా ఒకే సమాధానం అన్నట్లు, తరువాత ఎదురుగుండా ఉన్న దేవుడు ఫొటోకి మాత్రం చేతులెత్తి, "ఆపద్బాంధవా" అంటూ నమస్కరించింది. అది చూసి కామాక్షమ్మ ఆనందంతో "దైవభక్తి చాలా ఉందన్నమాట నీకు" అని వీపుమీద చెయ్యివేసి నిమిరింది. తరువాత నవ్వుతూ సమన్లు జారీ చేసే జడ్జిలాగ "ఊ ఈమారు పిలువు. నీ భర్తనీ పిల్లల్నీ ఇల్లుచూస్తారు" అంది.

వస్తున్న కోపం ఆపుకోవడం కష్టమైంది రమకు. ఈ పరిస్థితిలో ఈ ఇంట్లో జేరితే రోజుకో కొత్త సమస్య పుట్టుకొస్తుందేమోనని భయపడింది. సరే ఇంతవరకూ వచ్చాక వెను తిరగడం ఎందుకు. మరీ అంత పద్మవ్యూహంలోకి వెడుతోందా ఏమైనానా. తనలో తను నవ్వుకుని, "ఉండండి పిన్నిగారూ. మావార్నీ పిల్లల్నీ పిలుచుకు వస్తాను" అంది. అని అరుగుమీదకి వచ్చింది.

ఆషాఢ మాసమైనా ఇంకా వేడి గాలుపు వీస్తోందేమో, కుర్చీలో కూర్చున్న రఘురాం. ప్రక్కనే కూర్చున్న పిల్లలు ఎండదెబ్బకి తోటకూర కాడల్లా వాడిపోయి ఉన్నారు. వాళ్ళని ఆస్థితిలో చూసేసరికి రమకు చాలాబాధ కలిగింది.

టైం చూస్తే మూడయింది.

అంటే కామాక్షమ్మ తనని రెండు గంటలు ఇంటర్వ్యూ చేసిందన్నమాట!

"ఈ అద్దె ఇంటి అగచాట్లు పగవాళ్లకి కూడా వద్దు మహాప్రభో" అనుకుంది రమ.

"అమ్మా! మంచినీళ్లే"అంటూ పిల్లలిద్దరూ, జాలిగొలిపేలాగ చేత్తో సంజ్ఞచేస్తూ మరీ అడిగారు నీరసంగా.

రమ మనసు చివుక్కుమంది.

రఘురాం రమకేసి కోపంగా చూసి,"మమ్మల్నికూడా ఇంటర్వ్యూ చేస్తానంటోందా?" అనడిగాడు ఎర్రబడ్డ కళ్లతో.

వెనకాలే వచ్చి ఆ మాటలు విన్న కామాక్షమ్మ హుందాగా నవ్వుతూ"అబ్బే, మీకు అక్కర్లేదు ఇంటర్వ్యూ.ఎక్కువ టైము ఇంట్లో ఉండేది ఇల్లాలే కనుక ఆమెకే."అంది.

తర్వాత రామభక్తుడైన హనుమంతునిలా వంగి దోసిలొగ్గి నమస్కరిస్తూ "అయితే చాలా సంతోషం. ఇహ మీరు అద్దె సెలవిస్తే..."అన్నాడు రఘురాం వినయంగా.

భక్తుని ఆశీర్వదించబోయి ఆగిపోయిన భగవంతుని పోజులో నిలబడిపోయి పక్కకి తిరిగి "ఏవిటీ?చిన్నపిల్లలు మీరుకూడా దణ్ణం పెడుతున్నారా?"అంటూ కామాక్షమ్మ పిల్లల్ని చూసి ముసిముసినవ్వులు నవ్వింది.

"ఇంతకీ అద్దె సెలవిచ్చారు కాదు."అంటూ పెట్టిన దణ్ణం తీయకుండా ఆ మట్టున అలాగే నిలబడి అడిగాడు రఘురాం.

భర్తని ఆ స్థితిలో చూస్తే రమకి గుండె తరుక్కుపోయింది.

రఘురాం మాటకి సమాధానంగా కామాక్షమ్మ "అబ్బే..ఎంతోనా? మూడొందలు. అదైనా

మీ దంపతుల్ని చూస్తే ముచ్చటగా ఉండి ఇల్లు ఇస్తున్నాను."అంది తన మంచితనాన్ని ప్రకటిస్తూ.
రఘురాం రమ కళ్లలోకి చూసాడు.
"ఈ ఇంటికి అంత అద్దా?"అన్న ఆశ్చర్యంతోబాటు, "ఇంత అద్దె భరించగలమా?"అన్న భయంకూడా ఉంది ఆ చూపులో.
"సరే తర్వాత సంగతులు తర్వాత చూసుకుందాం.ముందు ఓ గూడు అంటూ ఒకటి దొరికిందిగా అలోచించకండి"అన్నట్లుగా రమ భర్తకేసి చూసింది.
ఎవరు ఎవరికేసి ఎలా చూసారో, ఎవరి చూపులో ఏ భాష ఉందో, అసలు ఆ కళ్లభాష ఏమిటో ఇవేవీ పట్టలేదు కామాక్షమ్మకి.
"తను అనుకుంటున్న అద్దె వస్తోంది"అన్న ఆనందంలో ఉంది.పిల్లలిద్దరూ మౌనంగా ఇల్లంతా కళ్లతో చూసారు. అంతా కొత్తగా ఉంది వాళ్లకి.సరే ఇంట్లోకి ప్రవేశించేదాకా ఒక ప్రకరణం, ఆ తర్వాత మరో ప్రకరణం.
ఇల్లు దగ్గర కావడం వల్ల పిల్లలు ఒంటిగంటకి అన్నాలకి వస్తారు. రఘురాం కూడా కాఫీకి వస్తాడు.ప్రొద్దుట వెళ్లినవాళ్లు సాయంత్రందాకా కనిపించరు అనడంకంటే మధ్యలో ఇలా మధ్యాహ్నం భర్తా పిల్లలూ ఓమారు ఇంటికి వెళ్లడం బాగానే వుంది రమకి.
బాగుండనిదల్లా తనమీద పడిన భారమే.
గిన్నెలు కడగడానికి బట్టలు ఉతకడానికి ఇంతక్రితం పనివాళ్లని పెట్టుకునేది. ఈ ఇంట్లోకి వచ్చాక వాళ్లని మానిపించేసి, ఆ పనులు తనే చేసుకోసాగింది.లేకపోతే నెలజీతం సరిపోదు.మూడువందలు ఇంటద్దె పోతుంది కదా!రోజంతా యంత్రంలా పనిచేసి అలసిపోతోంది.ఈ పనుల బాధ్యతలవల్ల అసలు తను బి.ఎ. పాసయ్యాను అనే సంగతే మర్చిపోయింది రమ.సరదాగా తన కాలేజి జీవితం, ఫ్రెండ్సూ, కబుర్లూ, చిన్నప్పుడు అమ్మ చేతిమీదుగా తిన్న కమ్మనిభోజనం, ఇవేవీ జ్ఞాపకం తెచ్చుకునేందుకు తీరికే ఉండడం లేదు.సరికదా ఓ కూనిరాగం తీసుకోడానికి కూడా వీలులేకపోతోంది. సన్నగా నెమ్మదిగా పాడితే "కొంచెం గట్టిగా పాడు. ఏం ? నీ పాట నేను వినకూడదా?"అనీ, నిజంగా గట్టిగా పాడితే "ఏవమ్మోయ్ ...ఏవిటా పాటలు...అసలే నాకు గుండెదడకూడాను"అనీ, ఇలా ఎలా పాడినా కామాక్షమ్మ సాధింపు మాత్రం తప్పడం లేదు రమకి.

సాధింపు సరే.ఎప్పుడైనా సరదాగా కొత్తచీర ఏదైనా కట్టుకుందో వెంటనే కామాక్షమ్మ కళ్లు వచ్చి పడతాయి. కళ్లు అంతలేసి చేసి ఆశ్చర్యంగా చూస్తూ దవళ్లు నొక్కుకుంటూ "ఉహూ..కొత్తచీర!మాఇంట్లోకి వచ్చాక మీ ఆయన సంపాదన బాగా పెరిగిందన్న మాట!కొత్తచీరలూ షోకులూ...రోజురోజుకీ చిన్నపిల్లవి అయిపోతున్నావు."అంటూ మూతి మూడు వంకర్లు తిప్పడం.

ఓ రకం భయం బయలుదేరింది రమకి కామాక్షమ్మ అంటే.

అది గమనించిన పిల్లలు "అదేమిటమ్మా!నాన్నకేనా భయపడవు.ఇంటామెకి అలా భయపడతావేమిటి?"అని నిలదీసి అడుగుతున్నారు.ఊరుకోండర్రా అంటే "ఏం భయపడకు. మనం అద్దె ఇస్తున్నాం కదా!"అని అరుస్తారు కామాక్షమ్మ వినేలాగ.

నాలుగు రోజులక్రితం కరివేప చెట్టు దగ్గరకి వెళ్లి " ఉప్మాలోకి రెండు రెమ్మలు కోసుకోనా పిన్నిగారూ!"అని అడిగింది రమ.

"ఆ...ఏవిటీ...కరివేపాకు కావాలా? వీధిలోకి వస్తుంది కొనుక్కో...చెట్టుమీద చెయ్యి వెయ్యకు..చెట్లు అమ్మేసాను."అంది కామాక్షమ్మ కఠినంగా.

ఆ మాటలకి తప్పుచేసినదానిలా తను సిగ్గుపడింది.కాని ఎక్కడనుంచి విన్నారో పిల్లలిద్దరూ రయ్‌మంటూ అక్కడికి వచ్చి "మరి రోజూ ప్రొద్దుటే పేపరు రాగానే మీరెందుకు చదువుతారు మాకంటే ముందు?కొనుక్కోలేరూ?"అని మందలించారు.

వాళ్ల ప్రశ్నకి కాస్సేపు ఉక్కిరిబిక్కిరయి"ఏవమ్మోయ్ రమా! నీ పిల్లలిద్దరూ చూడు. పెద్దదాన్ని అనే గౌరవమైనా లేకుండా ఎలా మాట్లాడుతున్నారో!"అంటూ కోపంగా వాళ్లకేసి చూసింది కామాక్షమ్మ.

"బాబూ! మీరలా మాట్లాడకూడదు. బుద్ధిగా చదువుకోండి వెళ్లి."అంటూ గెడ్డం పట్టుకుని పిల్లల్ని ప్రతిమాలింది తను.

తనకేసి జాలిగానూ,ఇంటామె కేసి కోపంగానూ చూసి "ఇంకోమారు మా అమ్మని ఏమైనా అన్నారో మేం ఊరుకోం"అని కుడిచేతి చూపుడువేలు చూపించి ఆమెని బెదిరించి మరీ కదిలారు పిల్లలిద్దరూ అక్కడినుంచి.

ఇలా జరిగిన సంగతులన్నీ తలచుకుంటూ అద్దె పెంచడమా, ఇల్లు ఖాళీచేసి మరో ఇల్లు చూసుకోవడమా? ఏమిటి చెయ్యడం? ఎటూ పాలుపోక తీవ్రంగా రమ ఆలోచిస్తున్న సమయంలో రఘురాం నవ్వుతూ ఆఫీసునుంచి వచ్చాడు.

అతనికి ఎదురు వెళ్లి "ఏమిటి సంగతులు?నవ్వుతూ వస్తున్నారేమిటీ?''అంటూ చిరునవ్వుతో పలకరించింది రమ.

"మనకి ప్రమోషన్ వచ్చింది. విజయవాడ ట్రాన్స్‌ఫర్ చేసారు."అంటూ రఘురాం ఆర్డరు కాగితం ఆమె చేతిలో ఉంచాడు.

సంతోషంతో "నిజంగా''అంటూ ఒక్క కేక వేసి గబగబా చదివి "హమ్మయ్య! అయితే ఇంటావిడతో నాకు ఇబ్బంది తప్పిందన్నమాట!''అంది రమ ఆనందంగా.

ఆ సాయంత్రం బజారుకి వెళుతూ "ఏంకావాలి?''అని అడిగాడు రఘురాం.

"మల్లెపూలు''అంది రమ.

"అవి మాత్రం మరచిపోవు ఇద్దరు పిల్లల తల్లివి అయినా."...ఛలోక్తిగా అన్నాడు రఘురాం.

"ఏం చెయ్యను మరి? ఇన్నేళ్లు కాపురం చేసినా చెప్తేగాని తెలియదాయె ఏం తేవాలో?''

ఇలా మాటల్ని పూల చెండుల్లా విసురుకుంటూ ఆ దంపతులిద్దరూ నవ్వుకుంటున్న సమయంలో కామాక్షమ్మ వాళ్ల వాటాలోకి వచ్చింది...ఇంటద్దె పెంచాలని రఘురాంకి చెప్పడానికి.

అది గమనించిన రమ రఘురాం ఇద్దరూ "రండి రండి''అని ఆవిడని ఆప్యాయంగా ఆహ్వానించి, ట్రాన్స్‌ఫర్ సంగతి చెప్పి "ఈ నెలాఖరుకి మేం ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోతాం విజయవాడ''అన్నారు.

ఆ మాటలు విని గతుక్కుమని "ఆ...ఏమిటి?నిజంగా? నిజంగానేనా?''అని కంగారుపడుతున్న కామాక్షమ్మకి, ఇంగ్లీషులో ఉన్న ఆర్డరు కాగితం చదివి తెలుగులో చెప్పింది రమ గర్వంగా...రఘురాం ఓ ప్రక్క నిలబడి కాలరు సర్దుకుంటూండగా.

"ఆహా..నిజమేనన్నమాట!''ఈ మాటలంటున్నప్పుడు కామాక్షమ్మ గొంతు గద్గదికం అయింది.

తర్వాత కళ్లలో కనిపించిన కన్నీటి తెరని పైట చెంగు చివరతో అద్దుకుని "ఏవిటో! ఏడాదినుంచి తల్లీపిల్లల్లా ఉంటున్నాం.మళ్లీ ఈ వాటాలోకి ఎలాంటి వాళ్లు వస్తారో!''అంది దిగులుగా.

అంతే!

ఆమె కళ్లు తడికావడం చూసేసరికి రమ రఘురాం గుండెలు కూడా జాలితో

నిండిపోయాయి.

"అలా బాధపడకండి పిన్నిగారూ!మిమ్మల్ని ఈ ఇంటినీ వదిలి వెళ్లాలంటే మాకూ ఏదోలా వుంది.ఏడాది నుంచి అలవాటు పడిపోయాం."అన్నారు.

అంతలోనే కామాక్షమ్మ కాస్త గర్వం తెచ్చుకుని "అవున్లే...మళ్లీ మీకు అక్కడ మా ఇల్లులాంటి మంచి ఇల్లు దొరకొద్దూ?"అంది.

"అంతేనండీ! మాకూ మంచి ఇల్లు దొరకాలి. మీకూ మంచివాళ్లు అద్దెకి రావాలి."అంది రమ.

"మంచితనం ఉంటే అంతా మంచిగానే ఉంటుందమ్మా!"అంది కామాక్షమ్మ గతాన్నంతా మరిచిపోయి.

"నిజానికి కామాక్షమ్మగారు మంచిదే! ఏదో మనుషులన్నాక మాటా మాటా వస్తే మాత్రం?"అనుకుంది రమ.

వాళ్ల మనస్తత్వాలు అర్థంకాక ఇద్దర్నీ చూసి వేదాంతిలా నవ్వుకున్నాడు రఘురాం.

❄❄❄

(వనిత 1990)